సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వ్రతాలు



వ్రతంలో పాల్గొన్న భక్తులు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని **కీతినేపేట** వద్ద గల ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో తృతీయ తిరు పవిత్రోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం స్వామి వారి సామూహిక వేంకటేశ్వరస్వామి, లక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. అర్చకులు శేషాచార్యులు, మనోజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతాల్లో పలువురు దంపతులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం శ్రీవారికి పవిత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కె.సూర్యనారాయణ మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, వి.బంగార్రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కొమ్మాది: గీతం విశ్వవిద్యాలయం రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 200 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఎన్‌టీఆర్ బ్లడ్‌బ్యాంక్, లైఫ్‌షేర్ బ్లడ్ బ్యాంక్ నిపుణులు హాజరై విద్యార్థుల నుండి రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో గీతం విద్యార్థి విభాగం డీన్ కె.బాలాకుమార్, డా.స్వాతి చిక్కాల తదితరులు పాల్గొన్నారు.

సుత్తమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ



తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మ తల్లి బుధవారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు అమ్మవారిని వివిధ రకాల పుష్పమాలలు, తులసిమాలలు, గజమాలలతో అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు.

కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

పద్మనాభం: మండలంలోని అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు ఇద్దరు అండర్-14 కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పాఠశాలకు చెందిన సి.హెచ్.సాయి కుమారి, జె.సుప్రజ వేములపూడిలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.

31 వరకు నట్టల నివారణ మందుల పంపిణీ

తగరపువలస: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 16 నుంచి 31 వరకు మేకలు, గొర్రెల కోసం చేపట్టనున్న నట్టల నివారణ కార్యక్రమాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ కోరారు. భీమిలి జోన్ 4వ వార్డు జీవీ అగ్రహారంలో మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులను వేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. సిబ్బంది 950 గొర్రెలు, మేకలకు మందులు ఇచ్చారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9493185214



ఆర్‌జీకే కల్యాణ మండపంలో పెట్టిన శానిటేషన్ పరికరాలు



అలంకార ప్రాయంగా ఉన్న ఆర్‌జీకే కల్యాణ మండపం



ద్రోణంరాజు కల్యాణ మండపంలో పార్క్ చేసిన క్లాప్ వాహనాలు

కళ తప్పిన కల్యాణ మండపాలు

- నిర్వహణను గాలికొదిలేసిన జీవీఎంసీ
- కానరాని కనీస సౌకర్యాలు
- మరీ అధ్వానంగా ద్రోణంరాజు మండపం
- క్లాప్ వాహనాలకు పార్కింగ్ ప్రదేశాల్లా వినియోగం



కనీస వసతులు లేని ద్రోణంరాజు కల్యాణ మండపం



ద్రోణంరాజు కల్యాణ మండపంలో శిథిలమైన ప్రధాన పిల్లర్

మధురవాడ: కల్యాణ మండపాల్లో కనీస వసతులు కరువయ్యాయి. జీవీఎంసీ మధురవాడ జోన్ 5, 7 వార్డుల్లో ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి, విశాలమైన స్థలాల్లో కల్యాణ మండపాలు నిర్మించినా నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. జీవీఎంసీ నిర్లక్ష్యంతో వేడుకలతో కళకళలాడాల్సిన కల్యాణ మండపాలు చెత్త తరలించే క్లాప్ వాహనాలకు పార్కింగ్ జోన్‌గా మిగిలిపోయాయి.

హైవే నుంచి వాంబేకాలనీకి వెళ్లే రోడ్డులోని కృష్ణానగర్‌లో ద్రోణంరాజు కల్యాణ మండపం, ఆర్‌జీకే కాలనీ జంక్షన్‌లో ఆర్‌జీకే కల్యాణ మండపం, వాంబే కాలనీలో మరో కల్యాణ మండపానిదీ ఇదే పరిస్థితి. వీటిల్లో శుచి, శుభ్రత, కనీస రక్షణ వంటివి మచ్చుకైనా కనిపించడంలేదు. అసలు కల్యాణ మండపానికి ఉండాల్సిన నామమాత్రపు సదుపాయాలు లేవు. పరిసరాలు కూడా ఇందుకు తగినట్లుగానే ఉండడంతో వేడుకల కోసం ఎవరూ ఇటు పక్కకైనా చూడటం లేదు. ఎక్కడ చూసినా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

లక్షల్లో కోల్పోతున్న ఆదాయం

ఈ మండపాల్లో ఫంక్షన్లు చేసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో 2012 నుంచి జీవీఎంసీ వేలంపాట వేసినా ఎవరూ పాడుకోవడం లేదు. 2011-12 సంవత్సరాల్లో ఏడాదికి రూ. 8లక్షలు చొప్పున ప్రైవేటు వ్యక్తులు చెల్లించి పాడుకునేవారు. తర్వాత ప్రభుత్వం భారీగా ధరలు పెంచేయడం, కనీస వసతులు లేకపోవడంతో ఇవి అలంకార ప్రాయంగా మిగిలాయి.

దయనీయంగా 'ద్రోణంరాజు' మండపం

మధురవాడ మధ్యలో ద్రోణంరాజు కల్యాణ మండపం ఉంది. 2008లో అప్పటి రాజ్యసభ సభ్యుడు ద్రోణంరాజు సత్యనారాయణ నిధులు మంజూరు చేయడంతో సుమారు అర ఎకరం విశాల స్థలంలో దీనిని నిర్మించారు. తర్వాత జీవీఎంసీ దీని నుంచి వచ్చే ఆదాయం తీసుకోవడమే తప్ప, వసతులపై గానీ, నిర్వహణపై గానీ దృష్టి సారించలేదు. కనీసం పెయింటింగ్ వంటి పనులు కూడా చేయలేదు. ఇక్కడ ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ శిథిలమై, కూలడానికి సిద్ధంగా ఉంది. మండపంలో వైరింగ్ సక్రమంగా లేదు. మరుగుదొడ్లు వాడడానికి అనువుగా లేవు. వధూవరుల కోసం ఏర్పాటు చేసిన గదులు రూపం తప్ప తలుపులు కూడా సవ్యంగా లేవు. ఇక పరిసరాల్లో తుప్పలు, చెట్లు పెరిగిపోవడంతో బూత్ బంగ్లాను తలపిస్తోంది.

ఆర్‌జీకే, వాంబే కాలనీల్లో కల్యాణ మండపాలదీ ఇదే పరిస్థితి. అధికారులు చిన్న మరమ్మతులు చేస్తే ఏడాదికి ఈ మూడింటి వలన కనీసం తక్కువలో తక్కువ రూ. 24 లక్షలు ఆదాయం జీవీఎంసీకి సమకూరుతుంది. రెండేళ్ల ఆదాయం ఖర్చు చేస్తే ఇవి ఎంతో ఉపయుక్తంగా మారతాయని స్థానికులు అంటున్నారు. లక్షల్లో అద్దెలు చెల్లించి ప్రైవేట్ మండపాల్లో వేడుకలు జరుపుకోలేకపోతున్నామని, ఈ మండపాలను అందుబాటులోకి తెస్తే పేద, మధ్య తరగతి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం

కల్యాణ మండపాల ప్రస్తుత పరిస్థితి గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. మరమ్మతులు చేయించి, వినియోగంలోకి వచ్చేందుకు చర్యలు చేపడతాం. – శ్రీనివాస్, జీవీఎంసీ వర్క్స్ ఏఈ

తక్కువ అద్దెకే అందుబాటులో ఉండేవి



గతంలో ఏ శుభకార్యం చేసుకోవాలన్నా జీవీఎంసీ కల్యాణ మండపాలు అందుబాటులో ఉండేవి. అద్దె తక్కువగా ఉండటంతో మాలాంటి వారికి ఎంతో సౌకర్యంగా ఉండేది. ఇప్పుడు మధురవాడ చుట్టుపక్కల ఎక్కడా అందుబాటులో ఫంక్షన్ హాల్స్ లేవు. దీంతో ఎక్కువ డబ్బులు పెట్టి ప్రైవేట్ కల్యాణమండపాలు బుక్ చేసుకోవాల్సి వస్తోంది. స్తోమత లేనివారు రోడ్డుపైనే కార్యక్రమాలు నిర్వహించుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి కల్యాణ మండపాలు అందుబాటులోకి తేవాలి. – పి.పార్వతి, చంద్రంపాలెం

ఎప్పుడు చూసినా చెత్త వాహనాలే..



కల్యాణ మండపాలను చూస్తుంటే ఇక్కడ ఫంక్షన్లు ఎలా చేస్తాం అనిపిస్తుంది. ఎప్పుడు చూసినా అక్కడ చెత్త వాహనాలే కనిపిస్తాయి. శుభ్రంగా ఉండే భవనాలు సరిగ్గా నిర్వహణ లేక దారుణంగా తయారయ్యాయి. ద్రోణంరాజు కల్యాణ మండపం అయితే మరీ అధ్వానం. కోట్ల రూపాయలతో కట్టిన భవనాలపై అధికారులు దృష్టి సారించాలి. ఫంక్షన్లకు అనువుగా తీర్చిదిద్దాలి. – పిళ్లా వెంకటరమణ, మధురవాడ

సినీ దర్శకుడు ఆదిత్యతో ఇష్టాగోష్టి నేడు

భీమునిపట్నం: కళాసాహితి సంస్థ ఆధ్వర్యంలో చిత్ర దర్శకుడు పి.సి.ఆదిత్యతో గురువారం ఇష్టాగోష్టి నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు పి.రాజేంద్రప్రసాద్ వర్మ, ఎ.సన్యాసిరాజు తెలిపారు. భీమిలి చిన్నబజారు శ్రీనివాస ఫంక్షన్ హాల్లో సాయంత్రం 4 గంటల నుంచి 6గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. త్వరలో ఆదిత్య తీయనున్న చలన చిత్రంలో స్థానికులకు అవకాశం కల్పించనున్నారని, నటనపై ఆసక్తి గలవారు ఆయన్ను కలిసి వివరాలు అందించవచ్చని తెలియజేశారు.

ఘనంగా షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డు పరిధి పీఎం పాలెం లక్ష్మీవానిపాలెంలోని షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి సాయినాథుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు 3వేల మంది పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

తగరపువలస: ఆనందపురం మండలంలో రూ.1.65 కోట్లతో చేపట్టనున్న ఉపాధి హామీ పథకం పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భూమిపూజ చేశారు. వీటిలో గంభీరం పంచాయతీలో ఎస్ఆర్ కళాశాల నుంచి ఐఐఎంవీ వరకు రూ.30 లక్షలతో బీటీ రోడ్డు, శ్రీలక్ష్మి బ్రిక్ ఇండస్ట్రీ నుంచి ఎస్ఆర్ కళాశాల వరకు రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, వేములవలస సచివాలయ భవనం నుంచి ఐఎంఎఫ్ఎల్ లిక్కర్ డిపో వరకు రూ.40 లక్షలతో సీసీ రోడ్డు ఉన్నాయి. అలాగే, బోని నుంచి లొడగలవానిపాలెం మీదుగా ఆనందపురం మండల పరిషత్ కార్యాలయం వరకు రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, పైడితల్లమ్మ ఆలయం నుంచి తర్లువాడ వరకు రూ.15 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణాలకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనలక్ష్మి, ఉపసర్పంచ్ నవీన్, కంటుబోతు రామానాయుడు, బి.ఆర్.బి.నాయుడు, బమ్మిడి సూర్యనారాయణ. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాలపై చర్చిస్తున్న ఈవో నానాజీ బాబు, ఉత్సవ కమిటీ సభ్యులు

పద్మనాభం: కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి 30 వరకు నిర్వహించనున్న పవిత్రోత్సవాలను విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని ఈవో నానాజీ బాబు కోరారు. ఉత్సవ కమిటీ, భక్త బృందం సంభ్యులతో పవిత్రోత్సవాలపై కుంతీ మాధవ స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 27వ తేదీ సాయంత్రం పుట్టబంగారం తీసుకురావడంతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 28న విశేష హోమాలు, 29న స్వామికి పవిత్రాలు సమర్పించనున్నట్టు తెలిపారు. 30న పవిత్రాల విసర్జనతో పాటు శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలకు శాంతి కల్యాణం నిర్వహించడంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయన్నారు. సమావేశంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, కాళ్ల నగేష్ కుమార్, బొలె అప్పలనాయుడు, సుంకర నారాయణరావు, కంటుబోతు ఎర్నాయుడు, రామసింగు సన్యాసిరావు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో సినిమా షూటింగ్



లొకేషన్‌లో హీరో నాగశౌర్య

కొమ్మాది: బీచ్‌రోడ్డులో హీరో నాగశౌర్య నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ జరిగింది. ఉప్పాడ, ఎంవీపీ కాలనీల్లో బుధవారం షూటింగ్ నిర్వహించినట్లు చిత్రం యూనిట్ సభ్యులు తెలిపారు. నాగశౌర్యపై ఇప్పటికే సింహాచలం, భీమిలి, ఆర్కే బీచ్ ప్రాంతాల్లో పలు సన్నివేశాలు చిత్రీకరించినట్లు చెప్పారు. భీమిలి-విశాఖ పరిసర ప్రాంతాల్లో మరో నాలుగు రోజులు పాటు ఈ సినిమా చిత్రీకరణ ఉంటుందన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈవో అనురాధ

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని అధికారులు బుధవారం పరిశీలించారు. జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ జేఎస్ శాస్త్రి, విశాఖ రూరల్ మండల విద్యాశాఖ అధికారి పి.అనురాధ భోజనం రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు పరిశీలించారు. ఎక్కువ మంది విద్యార్థులు గుడ్డు తీసుకోపోవడంపై ఆరా తీశారు. అందరూ గుడ్డు తీసుకోవడం, మరింత మంది భోజనం చేసేలా చర్యలు చేపట్టడంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్‌వీఎస్ సోమయాజులు పాల్గొన్నారు.

ఆహారాన్ని వృథా చేయొద్దు



మాట్లాడుతున్న జ్యోతికుమారి

భీమునిపట్నం: మనిషి మనుగడకు ఆహారం ప్రధాన అవసరమని, దాన్ని వృథా చేయకుండా చూడాలని స్థానిక జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా డైట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రపంచంలో సరైన ఆహారం అందనివారు కోట్లలో ఉన్నారన్నారు. ఆహారం దొరక్క ఎంతోమంది చనిపోతున్నారని, ఇది ఎంతో బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. పౌష్టికాహారం అందక చాలా మంది అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆహారాన్ని ఏమాత్రం వృథా చేయకూడదని అవకాశం ఉంటే లేనివారికి దాన్ని అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు యు.మాణిక్యంనాయుడు, జె.జి.ఎస్. నాగేశ్వరరావు, గొట్టేటి రవి పాల్గొన్నారు.

ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టండి

తగరపువలస: ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టాలని జీవీఎంసీ ఒకటోవార్డు బంగ్లామెట్ట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు సూచించారు. ఆహార దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ఆహారం ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు.

'కార్మికుల బకాయిలపై ఎమ్మెల్యే స్పందించాలి'

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు యాజమాన్యం చెల్లించవలసిన బకాయిలపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పందించాలని కాంగ్రెస్ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఐక్య కార్మిక సంఘాల కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే గంటాకు తెలియజేసి 3 నెలలు అయినా స్పందించలేదన్నారు. కార్మికులకు రావలసిన బకాయిలపై యాజమాన్యం దొంగనాటకం ఆడుతోందని, ఎమ్మెల్యే స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్మికులకు రావలసిన పీఎఫ్‌పై యాజమాన్యం రెండేళ్లుగా స్పందించడం లేదన్నారు.

చేతి వృత్తుల వారికి ప్రభుత్వ సహకారం



పీఎం విశ్వకర్మ యోజన పథకం బ్రోచర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గంటా

తగరపువలస: చేతివృత్తుల వారికి అండగా నిలిచి, వారికి పూర్వ వైభవం తీసుకువస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం అవగాహన, శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 రకాల చేతివృత్తుల వారికి ఆర్థిక స్వావలంబన కలిగించేలా శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించనున్నట్టు తెలిపారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాలలో 10వేల మంది చేతివృత్తుల వారిని గుర్తించగా 2 వేల మందిని ఈ పథకానికి ఎంపిక చేశామన్నారు. అనంతరం విశ్వకర్మ యోజన పథకం బ్రోచర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి ప్రియాంక శారద, భీమిలి ఎంపీడీవో హనుమంతరావు, పంచాయతీ విస్తరణ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్



కొమ్మాది వద్ద నిలిచిన ట్రాఫిక్

కొమ్మాది: కొమ్మాది, మధురవాడ జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం ట్రాఫిక్ స్తంభించింది. ఓ వైపు భారీ వర్షం, మరోవైపు ట్రాఫిక్‌జామ్‌తో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక్కడ సిగ్నల్ వ్యవస్థ ఉన్నప్పటికీ ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో నిత్యం ఇదే సమస్య వెంటాడుతోంది. పగలు, రాత్రి అని తేడా లేకుండా ప్రయాణికులు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుని, గమ్యానికి చేరుకోవడానికి గంటల తరబడి నిరీక్షించవలసి వస్తోంది. పోలీసులు చలానాపై చూపిస్తున్న శ్రద్ధ టాఫిక్ నియంత్రణపై పెడితే ఈ సమస్య ఉండదని వాహనదారులు నిట్టూరుస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వరిలో ఆకుముడతపై అధికారుల సూచనలు



దాకమర్రిలో రైతులకు కషాయాల గురించి తెలియజేస్తున్న వ్యవసాయాధికారులు

తగరపువలస: వరిలో ఆకుముడత, సుడిదోమను గుర్తించామని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకుడు చదువుల సుబ్రహ్మణ్యం తెలిపారు. దీని నివారణకు 250 గ్రాముల అసిఫేట్ పౌడర్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం భీమిలి మండలం దాకమర్రి, మజ్జివలస పంచాయతీలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ సుబ్రహ్మణ్యం రైతులకు మరిన్ని సూచనలు చేశారు. వరి పంట కంకుల దశ నుంచి పొట్ట దశలో ఉన్నందున 3 విడతలుగా 20 కిలోల పొటాష్, 25 కిలోల యూరియా వెయ్యాలన్నారు. దీనివలన గింజ గట్టిపడి నాణ్యమైన దిగుబడి సాధ్యమవుతుందన్నారు. దాకమర్రిలో జరుగుతున్న విత్తనోత్పత్తి పథకం గురించి రైతులకు తెలియజేశారు. రైతులు రెండో పంటగా కొత్త పోర్టిఫైడ్ రాగి వంగడాలను నాటే పద్ధతిలో వేసుకోవడం ద్వారా 15 నుంచి 18 క్వింటాళ్ల అధిక దిగుబడితో పాటు గిట్టుబాటు ధర పొందవచ్చన్నారు. రైతులకు సూక్ష్మసేద్యం ప్రాజెక్టు ద్వారా స్ప్రింకర్లు, బిందుసేద్యం వంటి పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతు బంధు పథకం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుల పంటను ఆరునెలల పాటు ఉచితంగా యార్డులో నిల్వ చేసుకోవచ్చన్నారు. తెగుళ్ల నివారణకు కషాయాల తయారీ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ భీమిలి ఏడీ విజయప్రసాద్, ఏవో శివకోమలి, సురేష్, మీరా బాయి, భాగ్యరేఖ పాల్గొన్నారు.

'ఆలయ నిర్వహణలో రాజకీయ జోక్యం తగదు'



పునర్నిర్మిస్తున్న బోని అమరేశ్వరాలయం

తగరపువలస: ఆలయ నిర్వహణలో రాజకీయ జోక్యం తగదని ఆనందపురం మండలం బోని సర్పంచ్ బోని అప్పలకొండ, ఎంపీటీసీ సభ్యురాలు బోని పార్వతి అన్నారు. వీరిద్దరూ బుధవారం మాట్లాడుతూ వందల ఏళ్ల నాటి ఈ ఆలయాన్ని దాతల సాయంతో రూ.35 లక్షలు వెచ్చించి పునర్నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దురుద్దేశంతో టీడీపీకి చెందిన వ్యక్తిని ఆలయ చైర్మన్‌గా నియమించి, తమను పాలనా బాధ్యతల నుంచి తప్పించారన్నారు. గత ఐదేళ్లలో తాము ముందుండి ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే, అప్పటి పాలకవర్గం ఆలయాన్ని వదిలేసి వెళ్లిపోయిందని పేర్కొన్నారు. అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా పాలకవర్గం జోలికి పోలేదన్నారు. ఇప్పుడు తమకేమీ సంబంధం లేదన్నట్టు టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. దేవదాయశాఖ ఇప్పటి వరకు ఆలయ బాగోగులు, అర్చకుని జీతభత్యాల గురించి కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. దీనిపై దేవదాయశాఖ అధికారులు జోక్యం చేసుకుని రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలన్నారు. ఈ విషయాన్ని ఈవో నానాజీబాబు దృష్టికి తీసుకుని రాగా ఆలయాలలో ఉత్సవాల నిర్వహణకు కమిటీ నియామకం జరిగిందన్నారు. ఇకపై ఆలయ ఆదాయం, ఖర్చులు అన్నీ బహిరంగంగా ప్రదర్శిస్తామన్నారు. దేవాలయానికి రాజకీయాలకు సంబంధం లేదన్నారు. ఆలయ పరిరక్షణ బాధ్యత పూర్తిగా దేవదాయశాఖదే అన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమిలి
9912220753
Office mail : sakshiadvtvsp@gmail.com